ఉచిత బస్సుతో ఆటోలపై అగ్గిపిడుగు

● ఆటోల్లో మహిళా ప్రయాణికులే ఎక్కువ
● రోడ్డున పడతామంటూ డ్రైవర్ల ఆవేదన


ఆటోలు

ఆకివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఆటో డ్రైవర్లపై అగ్గి పిడుగు పడినట్లయ్యింది. నిరక్షరాస్యత, నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతూ జీవన భృతి లేక, బతుకు దెరువు కోసం ఆటోలను నడుపుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్న ఆటో డ్రైవర్లకు పెద్ద కష్టం వచ్చిపడింది. నేను ఆటోవాణ్ణి.. ఆటోవాణ్ణి.. అంటూ ఎంతో ఆనందంగా జీవించే ఆటా డ్రైవర్ల జీవన పరిస్థితి క్షీణించే ప్రమాదం ఏర్పడింది. చేయి ఎత్తితే ఆగిపోయే ఆటో ఇకపై కంట్లో నలుసు అవుతుందా? అని పలువురు సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. కాయకష్టంతో పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ, ఆనందంగా జీవనం గడుపుతున్న వారి కుటుంబాలపై ఉచిత బస్సు ప్రభావం తీవ్రంగా ఉంటుందని పలువురు ఆటో డ్రైవర్లు మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నారు. నియోజకవర్గంలో సుమారు 840 ఆటోలు వివిధ మండలాల్లోనూ, గ్రామాల్లోనూ తిరగుతున్నాయి.

గోరుచుట్టుపై రోకలి పోటు

ఆర్థిక నష్టాలతో జీవనం గడుపుతూ ఇతరులపై ఆధారపకుండా జీవిస్తున్న ఆటోడ్రైవర్లపై ఉచిత బస్సు పథకం వల్ల గోరుచుట్టుపై రోకలి పోటు పడినట్లు అయ్యిది. పెరుగుతున్న ఆయిల్ ధరలతో పాటు ఆటోల మరమ్మతులు, బ్రేక్, ఇన్సూరెన్సులు, మెయింటెనెన్స్‌లు, అద్దెలు, పర్మిషన్లు, ఇతరత్రా ఖర్చులతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ రన్నింగ్‌తో ఆటోలకు అయ్యే డీజిల్, ఇతర మరమ్మతు పనులకు అయ్యే వ్యయంతో ఇంటికి చాలీచాలని సొమ్ము తీసుకువెళ్తున్న ఆటో డ్రైవర్లపై ఉచిత బస్సు పథకం వారి ఆశలపై నీళ్లు చల్లింది.

హామీ అమలును పట్టించుకోని వైనం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా రూ. 10 వేలు ఆర్థిక సహాకారం అందజేసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో రూ. 15 వేలు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి ఏడాది గడచినా పట్టించుకోలేదు. అలాగే ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో వర్కర్లు, ఓనర్లతో పాటు మెకానిక్‌లు, పెయింటర్లు, కవర్లు, ప్లెక్సీలు తదితర వాటిని తయారుచేసే కార్మికులపై కూడా దీని ప్రభావం పడనుంది.

నియోజకవర్గంలో ఆటోలు ఇలా

ఆకివీడు	230
ఉండి	220
కాళ్ల	180
పాలకోడేరు	210
మొత్తం	840

హామీని నెరవేర్చాలి



ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోల ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఆటోల్లో ప్రయాణించేది ఎక్కువగా మహిళలే. ప్రభుత్వ పథకం మా కడుపుకొట్టినట్లు అయ్యింది. ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలి. ఎన్నికల హామీల్ని అమలుజేయాలి.

– సోలోమన్‌రాజు, ఆటో ఓనర్లు, వర్కర్ల అసోసియేషన్ అధ్యక్షులు, ఆకివీడు.

మా పొట్టకొట్టారు



ఆటోలు నడుపుతున్నా ఆర్థికంగా మా కాళ్లపై నిలబడిన సంఘటనలు లేవు. ప్రతిరోజూ వస్తున్న సొమ్ము ఆటోలకు పెట్టుబడిగా సరిపోతుంది. ఇంటి అవసరాలకు ఇబ్బందిలేకుండా, ఎవరిపైనా ఆధారపడకుండా బతుకుతున్నాము. ఉచిత బస్సు ప్రయాణంతో మా పొట్టకొట్టినట్లు అయ్యింది.

– యెహోషువా, ఆటో డ్రైవర్, ఆకివీడు.

బ్రేక్, ఇన్సూరెన్స్‌లతోనే భారం



ఆటో మెయింటినెన్స్ దినదిన గండంగా ఉంది. బ్రేక్, ఇన్సూరెన్స్‌లతో పాటు మెయింటినెన్స్‌ల భారం అధికంగా ఉంది. ప్రభుత్వం ఆటో డ్రైవరల్ను ఆదుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 15 వేలు ఇవ్వాలి. ఇన్సూరెన్స్ తగ్గించాలి.

– పి.కుమార్, ఆటోవాలా, ఆకివీడు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు


స్థానిక మదనగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు


భీమవరం (ప్రకాశం చౌక్): ప్రత్యేకాలంకరణలో శ్రీవేణుగోపాల స్వామి

ఉండి: శ్రీ కృష్ణష్టమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం స్థానిక వేణుగోపాల స్వామి యాదవ సంఘం ఆధ్వర్యంలో 47వ శ్రీకృష్ణ జయంతి వేడుకలను వైభవంగా ప్రారంభించారు. ఉండి సంతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా శ్రీకృష్ణుని చిత్రపటాలను వాహనంపై వుంచి గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాధా కృష్ణులు, గోపికల వేషధారణలతో నిర్వహించిన ఊరేగింపు భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఈ నెల 20 వరకు జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ఉండిలో శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

భీమవరంలో..

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం 17వ వార్డు బంట్రోతు వారి వీధిలోని శ్రీవేణుగోపాల స్వామి మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. శనివారం ఆలయ కమిటి పర్యవేక్షణలో సంగినేడి దుర్గారావు దంపతులతో ఆలయ అర్చకులు శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకాలు, మేడూరి చంద్రశేఖర్ దంపతులతో తులసి పత్రి పూజ నిర్వహించారు. నాలుగు రోజులపాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని, ఈనెల 17న శ్రీవెంకటేశ్వర స్వామి వారి కత, 19న అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

వీరవాసరంలో..

వీరవాసరం: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వీరవాసరం మండలంలోని వాడవాడలా ఉట్టి మహోత్సవాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెర్కిపాలెం, కొణితివాడ, రాయకుదురులోని శ్రీకృష్ణ ఆలయాల వద్ద అన్న సమారాధన నిర్వాహించారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మదనగోపాలుడిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టి మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా నిర్వహించారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, వెంప, చినఅమిరం, రాయలం, నరసింహపురం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, గొల్లవానితిప్ప, తోకతిప్ప, నాగిడిపాలెం, కొమరాడ, అనాకోడేరు,గూట్లపాడు తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాలయాలలో కృష్ణ పరమాత్మునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు, యువకులు పెరుగు, కొబ్బరికాయ, వెన్నతో ఉట్టి కట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గొల్లలకోడేరు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో నిర్వహిస్తున్న వేడుకల్లో ఉండి ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.


వీరవాసరం: రాయకుదురులో ఉట్టి కొడుతున్న చిన్నారులు


ఉండి: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం


పాలకోడేరు: మోగల్లులో ఉట్టి కొడుతున్న చిన్నారులు

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు అన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, సీఎస్‌డీ, సీఎస్ఐటీ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్తంగా ఈ నెల 14, 15 తేదీల్లో టెక్నాలజీ సెంటర్లో 'వేదిక్ విజన్ 2కే25' పేరిట నిర్వహించిన హ్యాక్ థాన్ పోటీల్లో విజేతలకు శనివారం ఉదయం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఉభయగోదావరి జిల్లాలలోని 8 ఇంజనీరింగ్ కళాశాల నుండి 53 బందాలుగా 265 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ప్రథమ స్థానం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు సాధించగా, ద్వితీయ స్థానంలో సీఎస్ ఐటీ విభాగం విద్యార్థులు నిలిచారు. మూడవ స్థానంలో ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, డాక్టర్ పి.సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతుల అందజేత


విద్యార్థినులకు నగదు బహుమతులు అందిస్తున్న వెంకటరమణారావు

పాలకొల్లు సెంట్రల్: ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రకటించిన ఓ ఛాలెంజ్‌ను ఎనిమిది మంది విద్యార్థులు సాధించి చూపించారు. తన ఛాలెంజ్‌ను స్వీకరించి పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు అన్న మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. మండలంలోని పూలపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో స్వాతంత్ర దినోత్సవాల సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు వారది వెంకటరమణారావు రూ. 50 వేలు నగదు బహుమతి అందజేశారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 550 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.10,116లు 500 మార్కులు దాటితే రూ.1116లు, ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1116లు, నేషనల్ స్థాయిలో విజేతలకు రూ.10,116లు నగదు బహుమతి ఇస్తానని వెంకటరమణారావు ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు పి.వర్షిత నాగలక్ష్మి 568, జి.తేజస్వి 562, డి.రూపా తేజస్వి 552 మార్కులు సాధించగా ఒక్కొక్కరికి రూ. 10,116లు అందజేశారు. ఏవై లాస్యప్రియ 549 మార్కులు సాధించడంతో రూ.5116లు అందిచారు. ఎస్.కీర్తన 541, ఎస్ సత్యమణి 526, ఎం రమ్యశ్రీ 510 విద్యార్థినులకు రూ.1116లు అందజేశారు. యోగాంధ్ర స్టేట్ మీట్‌లో ప్రథమస్థానం సాధించిన బి.విజయ్ కుమార్‌కు రూ.1116లు చెక్కులను అందజేశారు. వీరికి రూ. 40 వేలు ఖర్చు కాగా మిగిలిన రూ.10 వేలతో స్పోర్ట్స్ కిట్లు అందించారు. తన తండ్రి వారది సూర్యనారాయణ జ్ఞాపకార్థం నగదు పురస్కారం అందించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీటీ వెంకటకుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందించారు.

పుంత రోడ్ల చింత తీరేదెన్నడు?

అధ్వానంగా మారుతున్న పుంత రోడ్లు


వడలి సుబ్బారాయుడు పుంత


సత్యవరం పుంత రహదారి

పెనుగొండ: వ్యవసాయ మార్కెటింగ్ యార్డులకు నూతన కమిటీల నియామకంతో పుంత రోడ్లపై రైతన్నలు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. ఆరుగాలాలు పాటు కష్టించి సాగు చేసుకున్న వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లులకు చేర్చుకోవడానికి పుంత రోడ్లు ఉపయోగపడతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో పుంత రోడ్లు నిర్మాణాలు చేశారు. అనంతరం పుంతరోడ్లు నిర్మాణాల వైపు కన్నెత్తి చూడలేదు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధుల కోత విధించడంతో పుంతరోడ్లు నిర్మాణాలకు ఆటంకం ఏర్పడింది. 2014 ప్రాంతంలో పెనుగొండ మండలంలో తామరాడ, వడలి, నడిపూడి, రామన్నపాలెం ల్లోనూ, పెనుమంట్ర మండలంలో రామేశ్వరం, జుత్తిగ, ఆలమూరు వంటి ప్రాంతాల్లోనూ పుంత రోడ్లు నిర్మాణాలు దాదాపుగా రూ.60 లక్షలతో పూర్తి చేశారు. అనంతరం మరోసారి నిర్మాణాలు చేయడానికి రూ.80 లక్షలతో సైతం పలు పుంతరోడ్లు నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు సైతం చేశారు. అయితే నిధుల కోత విధించడంతో ప్రతిపాదనల స్థాయిలోనే అటకెక్కాయి. అప్పటి నుంచి పుంత రోడ్లపై ఆశలు పెట్టుకున్నా రైతులకు నిరాశే మిగితుంది.

పుంత రోడ్లు నిర్మించాలని రైతుల వినతులు

ఇటీవల పెనుగొండ, ఆచంట ఏఎంసీలకు నూతన కమిటీల నియామకాలు పూర్తికావడంతో మరోసారి పుంత రోడ్లు నిర్మాణాలుపై రైతులు విజ్ఞప్తులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పెనుగొండ మండలం, పెనుమంట్ర మండలాల్లో పుంత రోడ్లు నిర్మాణాలు చేపట్టాలంటూ రైతులు విన్నవించుకుంటున్నారు. వడలి నుంచి దొంగరావిపాలెం వెళ్లే పుంత రహదారిలో వందలాది మంది రైతులు పంట ఉత్పత్తులను రోడ్డుపైకి తెచ్చుకోవడానికి నానావస్థలు పడుతున్నారని, పుంత రోడ్డు నిర్మాణం చేపడితే కష్టాలు తప్పుతాయంటున్నారు. అదేవిధంగా పెనుగొండ అడ్డపుంత రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పుంత రహదారిలో రైతుల వరిపొలాలుతో పాటు, కాలనీలు సైతం ఉండడంతో పుంత రహదారి నిర్మాణం చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు, రైతులు విన్నవించుకుంటున్నారు. దీంతో పాటు సత్యవరం పుంత రహదారి నిర్మాణం చేపట్టాలంటూ రైతులు కోరుతున్నారు. రామన్నపాలెం, వడలి, ఇలపర్రు, నడిపూడి, దేవల్లోనూ పుంత రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ వారికి మోగల్లుకి చెందిన పి.బలరామకృష్ణం రాజు-జానకి దంపతులు 8 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. వీరికి ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, ఫొటో అందించారు.

సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు


సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక మెయిన్ స్కూల్‌లో మద్దాల రామకృష్ణమ్మ ఆస్తుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దాల తాతారావు ఆర్థిక సహాయంతో శనివారం సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అంతా చక్కగా చదువు కుంటే మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేంద్ర దివాకర్, గ్రంధి పెద్దకాపు, మద్దాల రాజేష్ నాయుడు, మద్దాల శివాజీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు


ఆకర్షిస్తున్న బ్రహ్మకమలాలు

వీరవాసరం: మండలంలోని బాలేపల్లి గ్రామంలో యర్రంశెట్టి వెంకటేశ్వరరావు (తాతాజీ) మాస్టారు ఇంట్లో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా ఉండే అరుదైన బ్రహ్మకమలాలు శనివారం వికసించాయి. బ్రహ్మకమలాలు హిమాలయపర్వతాలు, ఉత్తరప్రదేశ్, ఉత్తర బర్మా, టిబెట్, నేపాల్, దక్షిణ చైనా ప్రాంతాల్లో దర్శనమిస్తూ ఉంటాయి. ఈ బ్రహ్మకమలములను కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్ అని పిలుస్తారు. ఇటువంటి అరుదైన పుష్పం పవిత్రమైన శ్రీ కృష్ణాష్టమి రోజు మా ఇంట్లో వికసించడం అదృష్టంగా భావిస్తున్నామని యర్రంశెట్టి తాతాజీ మాస్టారు అన్నారు.

వెంకన్నకు ఊంజల్ సేవ


వెంకన్నకు పూజలు చేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణ శనివారం, శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు అంగరంగ వైభవంగా అష్టోత్తర శతనామార్చన, సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ ఘనంగా చేశారు. స్వామి వారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గవర్నర్‌ను కలిసిన కంతేటి


గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో వెంకటరామరాజు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను భీమవరం శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి మందిర చైర్మన్ కంతేటి వెంకటరాజు విజయవాడలో కలిశారు. స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్లానని, అనంతరం నిర్వహించిన గవర్నర్ తేనేటి విందులో పాల్గొన్నట్లు వెంకటరాజు తెలిపారు. త్వరలో ఆలయంలో నిర్వహించే స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని వెంకటరాజు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 13న జాతీయలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి చెప్పారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవడానికి ఇదో మంచి అవకాశమని చెప్పారు. అన్ని రకాలు కేసులు రాజీ చేసుకోవచ్చని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువులో 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం శ్రీరామపురం, పెదగరువు గ్రామాలకు వెళ్లే 22 కేవీ ఫీడర్లకు సంబంధించి ఆర్‌డీఎస్ఎస్ పనులు, చెట్లు, కొమ్మలు తొలగించుట వార్షిక మరమ్మతులు నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత బీమా సంస్థ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిధుల కేటాయించారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ఉపసభాపతి కె.రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎల్ఐసీ రాజమండ్రి యూనిట్ సీనియర్ డివిజనల్‌మేనేజర్ సత్యనారాయణ సాహూ హాజరవుతారని స్పష్టం చేశారు.

నేడు శృంగవృక్షంలో ఉచిత వైద్య శిబిరం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యం లో ఆర్య వైశ్య కల్యాణ మండపం లో ఆదివారం ఉచిత వేరికోస్ వైన్స్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, సాలె పురుగు లాంటి నరాలు, పాదం వేలిలో గ్యాంగ్రిన్ రావడం,కాళ్లల్లో, పాదాల్లో నలుపు రావడం, ఉబ్బిన నరాలు,సుగర్ వ్యాధిగ్రస్తులకు కాళ్లపై పుండ్లు, వేళ్ళు నల్లబడటం, బోదకాలు చికిత్స, ఆకస్మికంగా తగ్గిన రక్త ప్రసరణను పునరుద్ధరించుట, కిడ్నీ రోగుల డయాలసిస్ ఏవీ ఫిస్టులా, కెరోటిడ్ డిసీజ్, వాస్క్యులర్ మాల్ ఫార్మేషన్స్‌కు చికిత్స, ప్రమాదాల్లో గాయపడిన రక్తనాళాలకు చికిత్సలకు ఉచితంగా వైద్యం చేస్తారని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రూ.5 వేలు విలువైన కలర్ డాప్లర్ అల్ట్రా సౌండ్ పరీక్షలు, కన్సల్టేషన్ ఉచితంగా చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోధ్య రాముని ఫొటోల పంపిణీ


అయోధ్య రాముని ఫొటోలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: అల్లూరి రాఘవ రాజు చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో మండలంలోని నెలమూరు గ్రామంలో శనివారం అయోధ్య రాముల వారి ఫొటో పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో శ్రీరాముని పటాన్ని స్థాపించడం ద్వారా శాంతి, సౌభాగ్యం, ఐక్యత నెలకొంటాయని వివరించారు. అనంతరం మహిళలు, పురుషులు, పిల్లలు అందరూ భక్తి శ్రద్ధలతో రాముల వారి టైల్స్ చిత్రాలను స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు గొట్టుముక్కల భాస్కర్ వర్మ, పీఎస్ఎన్ రాజు, అధ్యక్షుడు పీవీఎస్ఎస్ఎం రాజు (డీటీడీసీ బాబు) తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
90108 51166
Office mail : tpgadvt@gmail.com